నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaepaper.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
మంగళవారం
20-01-2026
పేజీలు: 02


# హరీశ్ రావును ఎదుర్కోలేకే సిట్ నోటీసులు జారీ

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. హరీశ్ రావును ఎదుర్కోలేక ఆయనపై తప్పుడు కేసులు పెట్టి నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు.రాజకీయ వేధింపులే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండాగా మారిపోయిందని ఆయన విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని, ఆ కేసును కొట్టివేసిందని ఆయన గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతోనే ఫోన్ ట్యాపింగ్ కేసు డ్రామా ముగిసిపోయిందని, అయినప్పటికీ మళ్లీ హరీశ్ రావుకు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ స్థాయికి దిగజారిందో అర్థమవుతోందని ఆయన మండిపడ్డారు. రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే, దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించే 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. హరీశ్ రావు తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజల కష్టాల్లో తోడున్న నాయకుడని ఆయన కొనియాడారు.అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడటంలో కానీ ఆయన చూపిస్తున్న చొరవను చూసి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని ఆయన అన్నారు. అందుకే రాజకీయంగా ఎదుర్కోలేక, ఇలాంటి తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని అన్నారు. గత 24 నెలలుగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఈ దారుణమైన పాలనను నిలదీస్తున్నందుకే హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.





## బహిరంగ వేలం ద్వారా రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్స్

హైదరాబాద్ పరిధిలోని 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లాలోని తొర్రూర్ (105 ప్లాట్లు), కుర్మల్‌గూడ (20 ప్లాట్లు), మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బహదూర్‌పల్లిలో (12 ప్లాట్లు) గల మొత్తం 137 ప్లాట్లను వేలం వేయనున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో వేలం ప్రక్రియ ఉంటుందని ఆయన వెల్లడించారు. బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువగా, చదరపు గజానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల మధ్య ధరలను నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల కొనుగోలుదారులు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వ యంత్రాంగమే ఈ ప్లాట్లను అభివృద్ధి చేయడం వల్ల కొనుగోలుకు మంచి డిమాండ్ ఉంటుందని ఆయన అన్నారు. ఈ వేలం ప్రక్రియ మరియు ప్లాట్ల వివరాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను (https://www.swagruha.telangana.gov.in/ais/) సందర్శించవచ్చని ఆయన తెలిపారు.



## సిట్ విచారణకు హాజరైన హరీశ్‌రావు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి కాసేపటిక్రితం ఆయన చేరుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలని మాజీ మంత్రి హరీశ్‌రావుకు సోమవారం రాత్రి సిట్ నోటీసు ఇచ్చింది. ఆయన ఇంట్లో లేని సమయంలో నానక్‌రామ్‌గూడలోని నివాసంలో అంటెండర్‌కు నోటీస్ అందజేసింది. పంజాగుట్టలో నమోదైన క్రైమ్ నంబర్ 243/2024 యూ/సెక్షన్.166, 409, 427, 201, 120 (బీ) ఆర్/డబ్ల్యూ, 34 ఐపీసీ, పీడీపీపీ యాక్ట్‌లోని సెక్షన్ 3, ఐటీ యాక్ట్ 2000లోని సెక్షన్ 65, 66, 66 (ఎఫ్)(1)(బీ)(2), 70 ఆధారంగా విచారణకు హరీశ్‌ను పిలిచారు. 'ఈ కేసులో ఇప్పటి వరకూ జరిగిన విచారణలో మీకు కొన్ని వాస్తవాలు, పరిస్థితుల గురించి తెలిసినట్లు వెల్లడైంది. కాబట్టి ఈ నోటీసు అందిన వెంటనే, తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 20న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో వ్యక్తిగతంగా హాజరుకావలసిందిగా కోరడమైనది' అంటూ సిట్ అధికారి వెంకటగిరి పేరుతో నోటీస్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే హరీశ్‌రావు ఇవాళ విచారణకు హాజరయ్యారు.

### ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనున్న

# భారత ఆర్థిక వ్యవస్థ

భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా దూసుకెళ్తోంది. రాబోయే రెండేళ్లలో, అంటే 2028 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. అంతేకాకుండా, 2030 నాటికి భారత్ 'ఎగువ మధ్య ఆదాయ' దేశంగా మారుతుందని అంచనా వేసింది. ప్రస్తుతం 'దిగువ మధ్య ఆదాయ' దేశాల జాబితాలో ఉన్న భారత్, 2030 నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశాల కేటగిరీలోకి చేరుతుందని నివేదిక పేర్కొంది. ఆ సమయానికి తలసరి ఆదాయం 4000 డాలర్ల (సుమారు రూ.3.30 లక్షలు) మార్కును అందుకోవచ్చని తెలిపింది. ఈ మార్పుతో చైనా, ఇండోనేషియా వంటి దేశాల సరసన భారత్ నిలుస్తుందని ఎస్‌బీఐ విశ్లేషించింది. "భారత్ మరో నాలుగేళ్లలో, అంటే 2030 నాటికి తలసరి ఆదాయంలో 4000 డాలర్లకు చేరి ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారనుంది" అని నివేదికలో పేర్కొంది.ఆర్థిక వృద్ధిలో కీలక మైలురాళ్లను కూడా ఈ నివేదిక ప్రస్తావించింది.



సుమారు రెండేళ్లలో, అంటే 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి భారత జీడీపీ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేసింది.

అప్పర్ మిడిల్ ఇన్‌కమ్ కంట్రీ అంటే ఏమిటి? ప్రపంచ బ్యాంకు దేశాలను వాటి తలసరి స్థూల జాతీయ ఆదాయం (GNI) ఆధారంగా వర్గీకరిస్తుంది. 2024 సంవత్సరానికి ప్రపంచ బ్యాంకు లక్ష్యం ప్రకారం..

దిగువ మధ్యతరగతి ఆదాయం: 1,136 డాలర్ల నుంచి 4,495 డాలర్లు

ఉన్నత మధ్యతరగతి ఆదాయం: 4,496 డాలర్ల నుంచి 13,935 డాలర్లు

అధిక ఆదాయం: 13,936 డాలర్ల కంటే ఎక్కువ

SBI ప్రకారం.. 2030 నాటికి భారతదేశం తలసరి GNI 4,000 నుంచి 4,500 డాలర్లకు చేరుకుంటుంది. ఈ స్థాయి భారతదేశాన్ని ఎగువ మధ్యతరగతి ఆదాయం విభాగంలోకి తీసుకువెళుతుంది.

1962: భారతదేశ తలసరి ఆదాయం దాదాపు 90 డాలర్లు

2007: 910 తలసరి ఆదాయంతో భారత్ తక్కువ మధ్యతరగతి ఆదాయ దేశంగా మారింది

2019: తలసరి ఆదాయం 2,000 డాలర్లు

2026 (అంచనా): 3,000 డాలర్లు

2030 (అంచనా): 4,000 డాలర్లతో ఎగువ మధ్యతరగతి ఆదాయం

SBI రీసెర్చ్ ప్రకారం గత దశాబ్దంలో భారతదేశం సగటు ఆర్థిక వృద్ధి రేటు ప్రపంచ వృద్ధి పంపిణీలో అగ్ర దేశాలలో ఒకటిగా నిలిచింది. భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటి. గత 10 సంవత్సరాలలో భారతదేశం కంటే చాలా తక్కువ దేశాలు వేగంగా వృద్ధి చెందాయి.

## కొబ్బరి బోండంపై రోహిత్ బొమ్మ



భారత జట్టు విధ్వంసక ఓపెనర్ రోహిత్ శర్మకు అభిమానగణం ఎక్కువే. తనమార్క్ షాట్లతో అలరించే హిట్‌మ్యాన్ భారీ సిక్సర్లు, ఫుల్‌షాట్లు కొడుతుంటే స్టేడియం దద్దరిల్లిపోవాల్సిందే. వచ్చే వన్డేప్రపంచకప్ ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ మాజీ సారథిపై తనకున్న అభిమానాన్ని ఒక యువకుడు వినూత్నంగా చాటుకున్నాడు. ఏకంగా కొబ్బరి బోండంపై టీమిండియా స్టార్ బొమ్మను చాలా నేర్పుగా చెక్కాడు. ప్రస్తుతం 'కోకోనట్ రోహిత్' వీడియో నెట్టింట వైరలవుతోంది. అభిమాన క్రికెటర్లపై ప్రేమను ఒక్కొక్కరు ఒక్కోవిధంగా వ్యక్తం చేస్తుంటారు. గతంలో ఒక కుర్రాడు క్యూబిక్ రూబ్స్‌తో పేసర్ మహమ్మద్ షమీ బొమ్మకు రూపమిచ్చాడు. ఇప్పుడు రోహిత్ శర్మ అభిమాని ఒకరు కొబ్బరి బోండంపై తన కళా ప్రావీణ్యాన్ని చూపించాడు. పొడవాటి కొబ్బరి బోండం పైభాగాన్ని హిట్‌మ్యాన్ రూపం వచ్చేలా తొలిచాడు.




## భారీ లాటరీని గెలుచుకున్న డ్రైవర్

హర్యానా రాష్ట్రం, సిర్సా జిల్లాలోని ముహమ్మద్‌పురియా గ్రామంలో ఒక డ్రైవర్ పది కోట్ల రూపాయల భారీ లాటరీని గెలుచుకున్నాడు. 35 సంవత్సరాల పృథ్వీ సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు, తండ్రి, సోదరుడు ఉన్నారు. భార్య స్థానిక పాఠశాలలో ప్యూన్‌గా పనిచేస్తోంది. పృథ్వీ సింగ్ తండ్రి కూడా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పృథ్వీ సింగ్ రూ.500 వెచ్చించి పంజాబ్ లోహ్రీ మకర సంక్రాంతి 2026 లాటరీ టిక్కెట్‌ను కొనుగోలు చేశాడు. ఈ లాటరీలో అతడికి మొదటి బహుమతిగా రూ.10 కోట్లు లభించాయి. తాను లాటరీ టిక్కెట్ కొనుగోలు చేయడం ఇది మూడవసారి అని పృథ్వీ సింగ్ తెలిపాడు. ఈసారి తనకు అదృష్టం కలిసి వచ్చిందని సంతోషం వ్యక్తం చేశాడు.





## కంటైనర్, కారు ఢీ.. నలుగురు దుర్మరణం

నిర్మల్ జిల్లా భైంసాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. సత్‌పూల్ బ్రిడ్జి వద్ద కంటైనర్ లారీ, ఎర్టిగా కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. కాగా, మృతులను కుబీర్ మండలం కుప్తిగ్రామానికి చెందిన పటేల్ (42), రాజన్న (60), బాబన్న (70), కారు డ్రైవర్‌గా గుర్తించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు హైదరాబాద్ వెళ్లి తిరిగొస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.




## శబరిమల గోల్డ్ చోరీ కేసు.. 3 రాష్ట్రాల్లో ఈడీ సోదాలు

శబరిమల అయ్యప్ప ఆలయంకు చెందిన బంగారం తాపడం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇవాళ మూడు రాష్ట్రాల్లో సోదాలు చేపట్టింది. ఆ ఘటనతో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో ఈడీ తనిఖీలు నిర్వహిస్తున్నది. కేరళ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 21 ప్రదేశాల్లో ఈడీ రెయిడ్స్ జరుగుతున్నాయి. పీఎంఎల్ఏ చట్టం పరిధిలో ఆ తనిఖీలు సాగుతున్నాయి. ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టికి చెందిన బెంగుళూరు నివాసం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రెసిడెంట్ ఏ పద్మకుమార్ నివాసంలో ఈడీ సోదాలు చేస్తున్నది. కేరళ పోలీసు శాఖ ఎఫ్ఐఆర్ ఆధారంగా జనవరి 9వ తేదీన పీఎంఎల్ కేసును ఈడీ ఫైల్ చేసింది. చాలా సంచలనంగా మారిన బంగారం మిస్సింగ్ కేసులో ఇప్పటికే సిట్ దర్యాప్తు జరుగుతున్నది.



# రొమాంటిక్ రకుల్

బీచ్ లుక్ & రకుల్ ప్రీత్ సింగ్... కిల్లర్ కాంబినేషన్ అని చెప్పాలి. రామ్ చరణ్ 'బ్రూస్ లీ' సినిమాలో 'పరేషానురా...' పాటలో ఆవిడ ఎంత అందంగా కనిపించారో చూశాం. ఇప్పుడు మరోసారి అటువంటి బీచ్ లుక్ ఫోటోలు షేర్ చేశారు రకుల్. రకుల్ నటించిన లేటెస్ట్ బాలీవుడ్ సినిమా 'దే దే ప్యార్ దే 2'. నవంబర్ 14న రిలీజ్ అవుతోంది. ఆ సినిమా కోసం బీచ్ లుక్ లో సందడి చేశారు రకుల్.'దే దే ప్యార్ దే 2' పెద్ద హిట్. అందులో రకుల్, అజయ్ దేవగణ్ మధ్య సీన్స్ చాలా వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఆ మూవీకి సీక్వెల్ తీశారు. ఇది కొత్త కథ. ఇందులో ఆయేషా పాత్రలో రకుల్ నటించారు.

02 EVENING EDITION
మంగళవారం। 20 జనవరి 2026 4PM
www.suryaa.com

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఏం అందంరా బాబు

అందాల ముద్దుగుమ్మ జాన్వీకపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ ముద్దుగుమ్మ తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంది. అతిలోక సుందరి గారాలపట్టీగా సిల్వర్ స్క్రీన్ పై అడుగు పెట్టింది ఈ బ్యూటీ. ధడక్ సినిమాతో వెండితెరపై మొదటి సారిగా సందడి చేసి, ఫస్ట్ సినిమాతోనే సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. తన గ్లామర్, నటనతో ప్రతి ఒక్కరి మనసు దోచి, వరస సినిమాలతో దూసుకెళ్తుంది. ఇక దేవర సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది.



## సంప్రదాయబద్ధంగా

# శబరిమల ఆలయం మూసివేత

కేరళలోని ప్రఖ్యాత శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు నెలలకు పైగా సాగిన మండల—మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర మంగళవారం ఉదయంతో ముగిసింది. సంప్రదాయబద్ధమైన పూజల అనంతరం ఉదయం 6:45 గంటలకు ఆలయ ద్వారాలను మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) ప్రకటించింది. ఆనవాయితీ ప్రకారం పందలం రాజకుటుంబ ప్రతినిధి పునర్తం నాళ్ నారాయణ వర్మ చివరి దర్శనం చేసుకున్న తర్వాత ఆలయాన్ని మూసివేశారు. అంతకుముందు ఉదయం 5 గంటలకు గణపతి హోమంతో నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. ప్రధాన పూజారి (మేల్శాంతి) ఈడీ ప్రసాద్ నంబూద్రి, అయ్యప్ప స్వామి విగ్రహానికి విభూతి అభిషేకం నిర్వహించి, రుద్రాక్ష మాలతో అలంకరించారు. అనంతరం పవిత్రమైన 'హరివరాసనం' గానం తర్వాత గర్భగుడి తలుపులను మూసివేశారు. ఆలయ తాళపు చెవులను రాజకుటుంబ ప్రతినిధికి అప్పగించగా, ఆయన వాటిని శబరిమల పరిపాలనా అధికారి ఎస్. శ్రీనివాసన్‌కు అందజేశారు. నెలవారీ ఖర్చుల కోసం ఉంచే డబ్బుల సంచిని




కూడా ఇదే సమయంలో అప్పగించడం ఇక్కడి సంప్రదాయం. ఇదే సమయంలో పవిత్ర తిరువాభరణాల తిరుగు ప్రయాణం కూడా మొదలైంది. 30 మంది సభ్యుల బృందం ఈ ఆభరణాలను తిరిగి పందలం ప్యాలెస్‌కు తీసుకువెళ్తోంది. ఈ బృందం ఈ నెల 23న పందలం చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది మండల-మకరవిళక్కు సీజన్ చాలా ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసిందని టీడీబీ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యాత్ర పూర్తయిందని తెలిపారు. పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

మళ్లీ తెరిచేది ఎప్పుడంటే?

తాజాగా ఆలయాన్ని మూసివేసినప్పటికీ, నెలవారీ పూజల కోసం ఫిబ్రవరిలో మళ్లీ తెరవనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు కుంభం మాసపు పూజల కోసం ఆలయాన్ని తెరిచి, ఫిబ్రవరి 17వ తేదీ రాత్రి 10 గంటలకు తిరిగి మూసివేస్తారు. ఈ సమయంలో భక్తులు దర్శనానికి రావొచ్చని టీడీబీ స్పష్టం చేసింది.

# భైంసాలో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు దుర్మరణం, కుప్తి సర్పంచ్ పరిస్థితి విషమం

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని సాత్ పూల్ వంతెనపై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నిర్మల్ నుంచి నాందేడ్ మార్గం వైపు వెళ్తున్న కంటైనర్ లారీ, నిజామాబాద్ వైపు నుంచి భైంసా పట్టణంలోకి వస్తున్న ఎర్టిగా వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎర్టిగా వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కుభీర్ మండలంలోని కుప్తి సర్పంచ్ గంగాధర్‌తో పాటు మరో ఐదుగురు గ్రామస్తులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గ్రామస్తుడిని



పరామర్శించేందుకు సోమవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. వీరందరూ రాత్రి పూట అక్కడి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మరికొద్ది నిమిషాల్లో భైంసాకు చేరుకునే సమయంలో వారి కారు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుభీర్ మండల కేంద్రానికి చెందిన ఎర్టిగా వాహన డ్రైవర్ బొప్ప వికాస్(24) తో పాటు అందులో ప్రయాణిస్తున్న భోజరామ్ పటేల్(42), కొడిమెల పెద్ద రాజన్న (62), బోయిడి బాబన్న (65)లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఇక మధ్య సీట్లో కూర్చున్న గ్రామ సర్పంచు గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. సిందే ఆనంద్ రావ్, గుండోల్ల లక్ష్మణ్(చిన్ను) స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సర్పంచ్ గంగాధర్‌ను భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న భైంసా ఏఎస్పీ రాజేశ్ మీనా, సీఐ సాయికుమార్‌లు ఘటనాస్థలికి చేరుకుని వాహనంలో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సహాయంతో బయటకు తీయించారు.



# అసభ్య వీడియోలు వైరల్.. కర్నాటక పోలీసు అధికారి సస్పెన్షన్

కర్నాటక పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారి కే రామచంద్రరావుపై వేటు పడింది. అసభ్యకరమైన వీడియోలు వైరల్ కావడంతో కర్నాటక సర్కారు ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేసింది. డీజీపీ స్థాయి ర్యాంక్ కలిగిన ఆ పోలీసు ఆఫీసర్ మహిళలతో తన ఛాంబర్‌లోనే రాసలీలలు ఆడాడు. ఆ ఘటనకు చెందిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో కర్నాటక రాష్ట్రంలో ఆ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. పోలీసుల తీరుపై నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎస్ ర్యాంక్ ఆఫీసర్ రామచంద్రరావును సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రామచంద్రరావు ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నట్లు ఉన్నదని ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొన్నది. డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో డీజీపీగా చేస్తున్న కే రామచంద్రరావును తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం తన స్టేట్మెంట్‌లో తెలిపింది. అయితే సస్పెన్షన్ సమయంలో ఆయన హెడ్‌క్వార్టర్‌ను వీడి వెళ్లరాదు. రాష్ట్ర ప్రభుత్వ లిఖితపూర్వక అనుమతితోనే ఆయన బయటకు వెళ్లాల్సి వస్తుందని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# తారలపై రూమర్లు మాములే అంటున్న రష్మిక



పబ్లిక్ లైఫ్ లో ఉండే తారలపై రూమర్లు తప్పవని నటి రష్మిక మందన్న చెప్పారు. కొన్ని రూమర్లు ఎంతగానో బాధిస్తాయని తెలిపారు. అయితే, రూమర్లు సృష్టించే వారు కేవలం వ్యూస్ తో వచ్చే డబ్బు కోసమే ఆ పని చేస్తారని రష్మిక అన్నారు. ఓ చిట్ చాట్ లో అభిమానుల ప్రశ్నలకు జవాబులిస్తూ రష్మిక పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. ''మీడియాలో, సోషల్ మీడియాలో వ్యూస్ కోసం కొంతమంది రూమార్లు సృష్టిస్తుంటారు.. నిజం చెప్పాలంటే ఆ వార్తలు కూడా ఎంతోమందిని పోషిస్తున్నాయి. అందుకే బతకనీ లెమ్మని వదిలేస్తా'' అంటూ రష్మిక ఓ అభిమానికి జవాబిచ్చారు. ఇండస్ట్రీలో అత్యధిక పారితోషికం తీసుకునే నటి అంటూ తనపై వచ్చిన రూమర్లపై రష్మిక స్పందించారు. అది నిజమైతే బాగుండని తాను కూడా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. తాను హీరోయిన్ గా నటించే సినిమాల్లో ఐటెం సాంగ్ లు చేయడానికి సిద్ధమేనని చెప్పారు. ఇండస్ట్రీలోని ముగ్గురు డైరెక్టర్లు అడిగితే తాను హీరోయిన్ కాకున్నా సరే వారి సినిమాల్లో ఐటెం సాంగ్ లు చేయడానికి సిద్ధమని రష్మిక తెలిపారు. అయితే, ఆ డైరెక్టర్లు ఎవరనేది మాత్రం రష్మిక వెల్లడించలేదు.




# కూటమి ఇప్పటికే రూ.23.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకుంది

గత 18 నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.23.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకుందని, దీని ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయని లోకేశ్ తెలిపారు. దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే రావడం గర్వకారణమని, పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ఇప్పుడు నంబర్ 1 స్థానంలో ఉందని అన్నారు.తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడి, ఢిల్లీని సైతం దద్దరిల్లేలా చేసిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఆయన తెలుగుదేశం పార్టీని స్థాపించడం వల్లే తెలుగుజాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలకు అభివృద్ధిని జోడించి రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని లోకేశ్ అన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు నేడు ఏపీ వైపు చూస్తున్నాయంటే దానికి కారణం 'బ్రాండ్ సీబీఎన్' అని స్పష్టం చేశారు.సీఎం చంద్రబాబుకు ఉన్న విజన్ కారణంగా ఆయన్ను ఏ విషయంలో అయినా గుడ్డిగా అనుసరించవచ్చని లోకేశ్ అన్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కొందరు విమర్శిస్తారని, కానీ భవిష్యత్తులో అవే అభివృద్ధి ఫలాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు జీపీఎస్ లాంటివారని, ఆయన నాయకత్వంలో తామంతా ఒక యంగ్ టీంగా ఎటువంటి ఈగోలు లేకుండా పనిచేస్తున్నామని తెలిపారు. ఆయన విజన్ సాధన కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామన్నారు.'బ్రాండ్ సీబీఎన్', 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని 'డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' వల్లే కంపెనీలు ఏపీకి క్యూ కడుతున్నాయని వివరించారు. గుజరాత్, ఒడిశా మాదిరిగా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా ముఖ్యమని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం కనీసం 15 ఏళ్లు కొనసాగాలని ఆకాంక్షించారు.

# నేటి నుంచి జెన్‌కోలో బదిలీలకు దరఖాస్తులు



తెలంగాణ విద్యుత్తు ఉత్పాదక సంస్థ(టీజీ జెన్‌కో)లో ఇంజినీర్లు, సిబ్బంది బదిలీలకు సంస్థ పచ్చజెండా ఊపింది. బదిలీల షెడ్యూల్‌ను సైతం విడుదల చేసింది. ఆశావాహులు మంగళవారం (ఈనెల 20) నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇదే తేదీల్లో ఆప్షన్లు కూడా ఎంచుకోవచ్చు. ఈ నెల 23 నుంచి 29 వరకు దరఖాస్తుల పరిశీలన జరిపి, బదిలీల జాబితా రూపొందిస్తారు. ఈ నెల 30, 31 తేదీల్లో బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తారు. ఇది వరకు ట్రాన్స్‌ఫర్ పాలసీ లేకపోగా, తాజాగా పాలసీని విడుదల చేశారు. హైదరాబాద్‌లో పదేండ్లు పూర్తిచేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీచేస్తారు. ప్లాంట్లల్లో 15 ఏండ్లు పనిచేసిన వారికి హైదరాబాద్‌లో పోస్టింగ్ ఇస్తారు. మెడికల్ 25, స్పౌజ్ 25, వ్యక్తిగత వినతుల కోటాలో 50% మేర అవకాశం కల్పిస్తారు. రామగుండంలో పనిచేస్తున్న మరో 10 మంది ఉద్యోగులను జెన్‌కో యాజమాన్యం బదిలీచేసింది. వీరికి యాదాద్రి పవర్ ప్లాంట్‌లో పోస్టింగ్ ఇచ్చింది. వీరిలో అకౌంట్స్ ఉద్యోగులు, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. రామగుండంలోని ఆర్టీఎస్-బీ స్టేషన్‌ను మూసివేయడంతో, ఈ ప్లాంట్‌లోని ఉద్యోగులను వైటీపీఎస్‌కు బదిలీచేశారు.

# కాలేజీ రోజులని జ్ఞాపకం చేసుకున్న శ్రుతి హాసన్

స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ తన పాత జ్ఞాపకాల్లోకి వెళ్లారు. తాను చదువుకున్న కాలేజీ రోజులను గుర్తుచేసుకుంటూ, చాలా సంవత్సరాల తర్వాత ముంబైలోని తన కళాశాల వీధిలో కలియదిరిగారు. ఈ సందర్భంగా తీసిన ఓ వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "చాలా ఏళ్ల తర్వాత మళ్లీ నా కాలేజీ వీధికి రావడం ఎంతో సంతోషంగా ఉంది. నేను ప్రతిరోజూ ఇక్కడే నడిచేదాన్ని" అని చెబుతూ శ్రుతి తన వీడియోను ప్రారంభించారు.కాలేజీ తర్వాత స్నేహితులతో కలిసి స్నాక్స్ తినేందుకు వెళ్లే ప్రదేశాన్ని చూపిస్తూ, అప్పుడప్పుడు అక్కడికి వెళ్లే వాళ్లం... రోజూ అక్కడికి వెళితే మాత్రం డబ్బులు మిగిలేవి కాదు అని సరదాగా వ్యాఖ్యానించారు. అనంతరం, ఒకప్పుడు ఎంతో ఇష్టంగా తిన్న మటన్ రోల్ కోసం ఓ రెస్టారెంట్‌కు వెళ్లారు. కానీ, ఇప్పుడు అక్కడ అది అందుబాటులో లేదని తెలిసి నిరాశ చెందారు. "రోల్‌కు ఏమైంది? జీవితంలో కొన్ని విషయాలు మారిపోతాయి" అని అన్నారు.కాలేజీ రోజుల్లో తాను జుట్టుకు పింక్ రంగు వేసుకున్నందుకు ప్రిన్సిపాల్ తనను ఆఫీసుకు పిలిపించారని ఓ సరదా సంఘటనను గుర్తుచేసుకున్నారు. గాయనిగా మారాలనే తన ఆసక్తి కూడా కాలేజీలోనే మొదలైందని శ్రుతి వెల్లడించారు. "చాలా నాస్టాల్జిక్‌గా ఫీల్ అవుతున్నాను. ఇన్నేళ్లయినా ఇక్కడ ఏమీ మారలేదు" అని తెలిపారు. ఈ వీడియోకు "జ్ఞాపకాల దారిలో ఒక ప్రయాణం" అని క్యాప్షన్ జోడించారు.

